క్లుప్తంగా

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా సేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళా సేవా పీఠం కార్యాలయంలో గురువారం ప్రజా గాయకుడు గుమ్మడి విఠల్‌రావు(గద్దర్) చిత్రపటానికి పీఠం సభ్యుడు, మాజీ గౌరవ అధ్యక్షుడు తాండ్రంగి రామారావు, రంగస్థల నటుడు గులిమి అప్పారావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గద్దర్‌గా పేదల పక్షాన నిలబడి తన పాట ద్వారా చైతన్యం కలిగించిన గొప్ప విప్లవ కవి, గాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కళా సేవా పీఠం వ్యవస్థాపకుడు నదవరపు సోములు, ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటల పోటీలు



పిల్లలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింధియా: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు కె.శామ్యూల్ ఆధ్వర్యంలో గురువారం షిప్‌యార్డ్ కాలనీలోని లలిత కళా మందిరం ఆవరణలో షిప్‌యార్డ్ కార్మిక కుటుంబాల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 15న నిర్వహించే వేడుకల్లో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ఎడ్యుకేషన్ ఆఫీస్ బేరర్ కర్రి ఆదిబాబు, కో ఆపరేటివ్ డైరెక్టర్ నూకరాజు, జి.ఆనంద్, కమల్, ఆర్.ఆనంద్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి రేపు

సీతమ్మధార: గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఓసి మనసా.. నీకు తెలుసా.. శీర్షికన సినీ సంగత విభావరి నిర్వహించనున్నట్లు మాజీ ఏడీసీపీ, సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన గాయనీ, గాయకులు పలు గీతాలు ఆలపిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని ఖాన్ కోరారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఇందిరానగర్, ఈపీఎఫ్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇందిరానగర్ 1-5, సంజీవయ్య కాలనీ, జయప్రకాష్‌నగర్-1, తిక్కవానిపాలెం, మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా, నరేంద్రనగర్, గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్, శ్రీనివాసనగర్, ఆర్ అండ్ బీ కూడలి ప్రాంతం, హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సిరులతల్లికి తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో, పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు.





గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు, విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

- పంద్రాగస్టు వేళ.. విద్యార్థులకు ఆటల పోటీలు
- సందడిగా గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్



స్కిప్పింగ్ ఆడుతున్న విద్యార్థినులు

గోపాలపట్నం: పంద్రాగస్టు వేడుకలకు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిద్ధమవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతున్నాయి. విద్యార్థుల ఆటపాటలతో జిల్లా పరిషత్ బాల, బాలికల ఉన్నత పాఠశాల గ్రౌండ్ సందడిగా మారింది. రెండు రోజుల నుంచి ఆటల పోటీలు జరుగుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళ.. విద్యార్థుల కేరింతలతో చూడ ముచ్చటగొలుపుతోంది. చుట్టుపక్కల వారు ఆటల పోటీలను చూసి తమ తీపి గుర్తులను నెమరు వేసుకుంటున్నారు. పోటీలను తిలకిస్తూ తోటి విద్యార్థులు కేరింతలు కొడుతున్నారు. బాలుర పాఠశాలలో కబడ్డీ, రోప్ స్కిప్పింగ్, ఖోఖో, క్రికెట్, పరుగు పందాలు వంటివి పోటీలు.. బాలికల పాఠశాలలో రోప్ స్కిప్పింగ్, పరుగు పందాలు, మ్యూజికల్ చైర్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వంటి ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పీఈటీ తగు సూచనలిస్తున్నారు.



విద్యార్థినులకు సూచనలిస్తున్న పీఈటీ

విద్యార్థులను దత్తత తీసుకున్న సిరి ఫౌండేషన్



చెక్కులు అందుకున్న విద్యార్థులతో సిరి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు సిరి ఫౌండేషన్ సభ్యులు దత్తత తీసుకున్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన రాయిబోని శ్రీనివాస్, అనకాపల్లి విశ్వనాథ్, బండారు జాహ్నవిలకు రూ.10 వేల చొప్పున చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ ట్రస్టీ సూరెడ్డి బాబూరావు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా అనేక మంది పిల్లలను దత్తత తీసుకుని సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చింతల శ్రీనివాసరావు, ఎల్వీ నారాయణరావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.నాగేంద్ర జోగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కాలేజీలో కౌన్సిల్ తనిఖీలు



విద్యార్థులు, అధ్యాపకులతో కౌన్సిల్ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం ఎక్స్‌టర్నల్ అకడమిక్ ఆడిట్ సభ్యులు, రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ తనిఖీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ సలహాదారు డాక్టర్ ఎస్.శంకర్, డాక్టర్ జి.రామలక్ష్మి క్యాంపస్‌లో అన్ని విభాగాలను, ప్రయోగశాలలను నిశితంగా పర్యవేక్షించారు. ఐక్యూఏసీ ఆధ్యాపక సభ్యులు ఉత్తమ అభ్యాసాలను, విద్యార్థులు సాధించిన విజయాలను తెలుసుకుని అవార్డులను పరిశీలించారు.

మెటలర్జీలో ఉపాధి అవకాశాలు

మురళీనగర్: మెటలర్జీలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని సెయిల్‌యూకేలో హెల్త్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజర్ వీవీఎస్ రాజు అన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు కోసం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునికంగా తయారు చేసిన మెటలర్జీ ల్యాబ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మెటలర్జీ కోర్ సెక్టార్‌తోపాటు దాని అనుబంధ రంగాల్లో అనేక విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కాలేజీ పూర్వ విద్యార్థిగా ల్యాబ్‌ల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీవీఎస్ రాజును ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ కె.రత్నకుమార్ పాల్గొన్నారు.



వీవీఎస్ రాజును సత్కరిస్తున్న కాలేజీ సిబ్బంది

ఆర్పీ పేట పాఠశాలకు వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న పల్లా సోమేశ్వరరావు, తోట నగేష్

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంచరపాలెం సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట నగేష్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా సోమేశ్వరరావు(జపాన్) చేతుల మీదుగా మైక్ సెట్‌ను హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అందజేశారు, కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గండి రవి, గణేష్, బుల్లిబాబు, కిరణ్, తరుణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పిల్లలతో మాత్రలు మింగిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నులిపురుగుల నివారణ మాత్రలను 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పంపిణీ చేశారు. పిల్లలతో వాటిని మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు నులిపురుగు నివారణ కోసం ఈ మందులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. మనం తినే ఆహారం శరీరానికి అందాలంటే కడుపులో ఉండే నులిపురుగులు పోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు దీపిక, ఆరోగ్య కార్యదర్శి శివలక్ష్మి, ఆశా వర్కర్ మేరి అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక యూపీహెచ్‌సీ డాక్టర్ నాన్సీ, స్కూల్ హెచ్‌ఎం హరికృష్ణ, ఎంఈవోలు త్రినాథరావు, ఎల్.వి.రావు ప్రారంభించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాన్సీ మాట్లాడుతూ పిల్లల శరీరాల్లోకి వివిధ మార్గాల ద్వారా నులిపురుగులు చేరుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా చేతుల శుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని సూచించారు. నులిపురుగుల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం ఏటా డీ వార్మింగ్ డేను నిర్వహిస్తోందని, మాత్రలను పంపిణీ చేస్తోందని తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




మల్కాపురం పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న డాక్టర్ నాన్సీ

13న చిత్రలేఖనం పోటీలు

డాబాగార్డెన్స్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్ బై ఉషా డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ అకాడమీచే ఈ నెల 13న చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.ఉష ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రం ప్రముఖుల చేతుల మీదుగా అందజేయనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848852039 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

మెయిన్ లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం-పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్స్, మలుపుల్ని పరిశీలించారు. పర్యటనలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, జేసీబీ ఆపరేటర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324, 83338 49420 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్ వాసి.. విశాఖలో అదృశ్యం



రోహన్

తాటిచెట్లపాలెం: పాలిటెక్నిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన బాలుడు ఇంట్లో చెప్పకుండా విశాఖపట్నం వచ్చేసి.. అదృశ్యమయ్యాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ.. నేరేడ్‌మెట్(హైదరాబాద్)కు చెందిన గోవర్ధన్.. కుమారుడు కె.రోహన్ రాజు(17)ను మందలించడంతో సికింద్రాబాద్‌లో రైలెక్కి ఈ నెల 4న విశాఖలో దిగాడు. ఇక్కడ నుంచి వేరే వారి సెల్‌ఫోన్ నుంచి తన ఫ్రెండ్‌కు ఫోన్ చేసి విశాఖ వచ్చినట్లు చెప్పాడు. అతను బాలుడి తండ్రికి విషయం చెప్పాడు. వెంటనే రోహన్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహన్ ఇంటి నుంచి బయలు దేరినప్పుడు క్రీం కలర్ టీషర్ట్, డార్క్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామన చాయ రంగు, సన్నగా ఉంటాడని తండ్రి గోవర్ధన్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వేపోలీస్ స్టేషన్‌లో గానీ, 98664 13487లో గానీ తెలియజేయవచ్చు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రగతి

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో గల పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఫార్మేటివ్-1/ క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షలో సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సాధించిన మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా అందజేశారు. విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తున్నారనే విషయమై వారి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్, సబ్జెక్టు టీచర్లు సమక్షంలో చర్చించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో హెచ్‌ఎం పైడిరాజు మాట్లాడుతూ విద్యార్థుల చదువుల విషయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారనేది తల్లిదండ్రులు గమనించాలని, ఈ విషయంలో ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి సబ్జెక్టు టీచర్లతో మాట్లాడవచ్చన్నారు.

ఢిల్లీలో ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ నాయకుల నిరసన



ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: న్యూ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్) విధానాన్ని రద్దు చేయాలి కోరుతూ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్‌టీయూసీ అనుబంధ యూనియన్) నాయకులు నినాదాలు చేసి తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ వల్ల ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తరువాత భద్రత ఉంటుందన్నారు. ఓపీఎస్‌ను సాధించే వరకు తమ పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ పోషణ' కిట్ల పంపిణీ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బిషప్ కె.మరియదాస్ కమ్యూనిటీ హాల్లో గురువారం 'వైఎస్సార్ సంపూర్ణ' పోషణ కిట్ల పంపిణీ జరిగింది. బాబుకాలనీ, సెబ్బాసియన్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు కిట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ , స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న తరం ఆరోగ్యవంతంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టారని ఆమె తెలిపారు. సుమారు 41 మంది గర్భిణులు, బాలింతలకు జగనన్న పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ వీనీల, కలెక్టర్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణి రావు, కమల్, శ్యామ్‌సుందర్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, ఏఎన్ఎంలు బిందు, సాయికుమారి, సుహాసిని, మహిళా పోలీసులు లావణ్య, ప్రియాంక, కుమారి, నిఖిల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



జగనన్న పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

21లోగా ఓటరు సర్వే పూర్తయ్యేలా కృషి

సీతంపేట: ఈ నెల 21లోగా ఇంటింటా ఓటరు సర్వే పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం షాదీఖానాలో పశ్చిమ నియోజకవర్గం(24) పరిధిలో ఉన్న బీఎల్‌వోలు, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఇంటింటా ఓటరు సర్వేపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఫారం 6, 7, 8లను ఎలా వినియోగించాలి, ఓటరు నమోదు ప్రక్రియలో పాటించాల్సిన ముఖ్య విషయాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జయ, వీరభద్రరావు జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెన్షనర్ల ఐక్యతే ఆయుధం

మల్కాపురం: పెన్షనర్ల ఐక్యతే ఆయుధమని పెన్షనర్ల జిల్లా కార్యదర్శి హుస్సేన్ అన్నారు. మల్కాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎం.సూర్యారావు అధ్యక్షతన గురువారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో జరగబోయే పోరాటలకు పెన్షనర్ల సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఒక రోజు నిరాహార దీక్షను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కె.అప్పారావు, సుధాకర్, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

17 నుంచి కన్యకాపరమేశ్వరికి శ్రావణం పూజలు




ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు

డాబాగార్డెన్స్ : నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంథి రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో పలువురు ప్రముఖులచే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, మహిళలచే వివిధ అమ్మవార్ల స్తోత్ర పారాయణ, సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలి శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలంకరణ, సామూహిక లలితా సహస్రనామ పారాయణ, 108 గోత్ర రుషి పూజలు ఉంటాయన్నారు. రెండో శుక్రవారం సువర్ణ వస్త్రాలంకరణ, నవ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, మూడో శుక్రవారం ముత్యాల చీర అలంకరణ, నవ పుష్పాల పూజ, నాల్గవ శుక్రవారం రజిత వస్త్రాలంకరణ, 108 ద్రవ్యాలతో అమ్మవారి మూల విరాట్‌కు సహస్ర ఘటాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, ఐదో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, ఆలయ కోశాధికారి సుగ్గు శివకుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు వేదా కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు నైపుణ్యమే కొలమానం

డాబాగార్డెన్స్ : నైపుణ్యమే ప్రతిభకు కొలమానమని, మెలకువలు తెలుసుకున్నప్పుడే క్రీడాకారులుగా రాణించగలరని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు పేర్కొన్నారు. కళాశాల పూర్వ కరస్పాండెంట్ ఇంద్రాణి జగ్గారావు మెమోరియల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఏటా ఇంద్రాణి పేరిట క్రీడా పోటీలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇంద్రాణి జగ్గారావు సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న కళాశాలల్లో ఏవీఎన్ కళాశాల ఒకటని, కరస్పాండెంట్లుగా బాధ్యతలు నిర్వహించిన వారు ఎన్నో సమాజహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. కళాశాల పీడీ గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో నగరంలోని 10 డిగ్రీ కళాశాలలకు చెందిన 24 వాలీబాల్, హ్యాండ్‌బాల్ టీమ్‌లతో పాటు వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్ విభాగంలో ఏవీఎన్ కళాశాల విజేతగా నిలవగా, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల రన్నరప్‌గా నిలిచింది. త్రోబాల్ బాలికల విభాగంలో కణితి జెడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, బాలాజీ హైఫీల్డ్ ఇంగ్లిషు మీడియం స్కూల్ రన్నరప్‌లో నిలిచింది. త్రోబాల్ బాలుర విభాగంలో కణితి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలవగా, సింహాచలం ఎంజేపీ స్కూల్ రన్నరప్‌గా నిలిచారు. కళాశాల డీన్ శంకరనారాయణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, భానుమతి పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న కళాశాల కరస్పాండెంట్ భానోజీరావు